# ఆరో ప్రాణం

''కొంచెం ఆ మఫ్లరు చెవుల చుట్టూ చుట్టుకోండి' అన్నది కమల. ఆ మాటలు అతడికి వినిపించాయో లేదో కాని, ఆమె ఆశించిన విధంగా అతడు ఆమె కేసి తిరిగి చూడనైనా లేదు. ఒకవేళ వినబడే వున్నా, ప్రొద్దున లేచింది మొదలు, ఆమె అజమాయిషీకి అంతువుండదు. అందువల్ల వినపడినా, వినిపించుకోనట్లు నటించటం అలవాటు చేసుకుంటున్నాడు. అదీకాక, ఇప్పుడు పచ్చనిచెట్టు పుట్టలు, మేఘాల అంచులూ, రకరకాల, రంగురంగుల పువ్వులూ, వింతైన పిట్టలూ, చూస్తూ ప్రకృతి సౌందర్యానికి ముగ్ధుడవుతూనూ వున్నాడు. మనసు మూగ బోవటంలో విశేషమేముంది? కొండమీద మెలికలు మెలికలు తిరుగుతున్న రోడ్డుపైన కారుప్రయాణం యెంత బావుండేను! ఆ అందమైన అనుభవాన్ని యెవరు మాత్రం వర్ణించగలరు? భగవంతుడి చిరునవ్వును వర్ణించగలరా యెవరైనా? మల్లెపువ్వు వాసనను తెలీనివాడికి వర్ణించి చెప్పతారా యేమిటి? అటువంటిదే కొండమీద కారు ప్రయాణం కూడా.

అదీకాక, వెంకటేశ్వర్లుకు యీ అనుభవం, పదిరోజుల పాటు చీకటికొట్లో బంధించి, ఒకరోజు అప్పుడే తెలతెలవారుతుండగా - ఇంకా సూర్యుడుదయించలేదు- చీకటికొట్టు తలుపులుతెరచి, పొరపాటయింది, అసలు నిన్ను కాదు మేము బంధించాలనుకున్నది అని చెప్పి, దేవదూతలు లోకంలోకి విడిచిపెట్టినట్లుగా వున్నది. ఒక్కసారి చేతులూ, కాళ్లూ విదిలించుకుని, మనస్సులో పరమేశ్వరునికి నమస్కారం చేసి తూరుపు దిక్కుకు తిరిగితే, రంగురంగుల మబ్బుల అంచులపైన సూర్యుడు బంగారు పూతలు పూస్తుంటే ఆ దృశ్యం మనస్సుపైన

యెలాటి ముద్ర వేస్తుందో యెవరు చెప్పగలరు? అలావుంది వెంక టేశ్వర్లు మనస్థితి. అదీకాక దేంట్లోనైనా 'అతి' పనిచెయ్యదాయె. అయితే, విశేషం యేమిటంటే, కమల తన మాటలోకాని, చేతలోకాని తాను చేస్తున్నది యేదీ అతి అనుకోదు. ఒక వేళ యెవరైనా చెప్పినా వొప్పుకోదు. అసలామె కా ఊహ ఊహకే అందదు. ఎప్పుడైనా వెంక టేశ్వర్లు దిగులుగా, దీనంగా, "ఇంకా యెక్కువ తినేది, నేను మనిషినా రాక్షసినా? ఇది కడుపా, బానా, పొట్టా, చెరువా?" మొదలైన మాటలు చెప్పబోతాడు కంచం ముందు, కాని, యీ యుక్తులు యెంతమాత్రమూ కమల ముందు పనిచెయ్యవు. ఆమె మృదువుగా నవ్వి, "మా నాన్న గారు యేం చెపుతూవుండే వారో తెలుసా? రోజుకో ముద్ద యెక్కువ చేసి తింటూవుంటే ఇరవై రోజుల్లో ఇద్దరు మనుషుల తిండి తినవచ్చు నట తేలిగ్గా. ఏదీ మీరు యేం తింటున్నారని .... అసలు" అంటుంది. ఇంతలోనే ఆమె ముఖం విషాదచ్ఛాయలతో నిండిపోయేది, వాళ్ళనాన్న గుర్తువచ్చి. అప్పుడామెకు సమాధానం చెప్పి, వొప్పించి మళ్ళీ ఆమె ముఖం కళ కళలాడేట్లు చెయ్యటం కష్టం.

అంచేత కష్టపడి ఇంకోసారి పచ్చడి కలుపుకోవటమో, కూర కలుపుకోవటమో మాత్రమే ఆమె మళ్ళీ మామూలు స్థితికి వచ్చేం దుకు సాయం చేసేది వెంకటేశ్వర్లు విషయంలో. "ఇవాళ ఆ డ్రెస్ యెందుకు బయటకు తీశారూ? ఆ పెట్టెమీద మీ బట్టలు తీసేవుంచాను కదా? ఇదిగో, నేను చేతులు తుడుచుకొని వస్తున్నాగా? ఇంతలోనే తమరు ఆ నూనంతా నెత్తిన వొలికించుకోకపోతే యేమో! నే నెందు కంటా ఇకమరి! ఇలా కొంచెం వంగండి. పాపిట సరిగ్గా రావటం లేదు. ఏం వెధవ పుస్తకాలు బాబూ, ఆ రాసేవాళ్ళు యెందుకు రాస్తారో - చదివే వాళ్ళంతా ఇంత ఇదిగా యెందుకు చదువుతారో సుమండీ! నాకు తెలీకడుగుతాను. ఇన్ని పుస్తకాల్లోనూ కొత్త విషయాలుంటాయంటారా? నా కళ్ళమీద లైటుకాంతి పడితే నాకు నిద్రపట్టదు. కోపం వచ్చిందా,

లైటు తీసేశాననీ! నాకేం భయం లేదు. ప్రొద్దునకల్లా కళ్ళు యెర్ర పడకుండా ఇక పడుకోండి సార్! మరేం ఫరవాలేదు, వాచక పుస్తకంలో యేమున్నదండీ! "మంచిపిల్లవాడు పెందలకడనే నిద్రించును....' ఈ విధంగా అతడి బ్రతుకును శాసించేది ఆమె.

"నేను పసివాణ్ణనుకున్నావా? నాకేం భగవంతుడు యేమాత్రమూ బుద్ధి యివ్వలేదనుకున్నావా? ఏమిటీ నీ వాలకం?" అని కసురుకుంటే వెక్కిరిస్తూ "ఆ విషయం అత్తయ్యగారి నడగండి" అనేది. వెంకటేశ్వర్లు అమ్మను రహస్యంగాను, బహిరంగంగానూ,కసురుకుంటూను వేడుకుంటూనూ, యెన్నోసార్లు, ముఖ్యంగా ఆ పిల్ల ముందర తనను, పిచ్చి సన్యాసి అని, గంగిగోవు అనీ, అమాయకుడనీ, ఆకలైన విషయంకూడా కనుక్కోలేని వాడననీ అనవద్దని యెన్నో మాట్లు చెప్పాడు. ఎన్నిమాట్లు చెప్పినా, ఆ పిల్ల అక్కడే వుంటే "చూశావుటే వీడేమంటున్నాడో" అనేది. ఆ పిల్ల అక్కడ లేకపోతే పిలచి మరీ "విన్నావుటే" అని చెప్పేది ఆమె. వాళ్ళిద్దరూ తాము కన్నుక్కున్న కొత్త విషయాలనూ, ఇటీవల అటువంటి కొత్త సంగతులు ఏమీ లేకపోతే ఇదివరలో తెలిసికున్నవే అనుకుందాము, అవి చెప్పుకునేవాళ్ళు, ఆ విషయాలు వెంకటేశ్వర్లును గురించినవే. ఒకసారి మరీ విసుగొచ్చి, కోపంవచ్చి, "నీ ప్రేమతో నేను చచ్చిపోయేట్లుగా వుంది" అన్నాడు.

ఎటూ తప్పించుకోలేక, భయంతో ముందే ప్రాణాలు పోతున్న పరిస్థితి వచ్చి, ఎట్ట ఎదురుగా వేటకాని బాణం గురిపెట్టబడి వుండి, వాడికేసి చూసిన లేడి కళ్ళలాటి కళ్ళతో అతడికేసి ఒక్కసారి చూసి, అప్పుడు చేతిలోని కూరపళ్ళెన్ని కంచంలో పారేసి అతడి బుజంమీద తలపెట్టి వెక్కివెక్కి యేడ్చింది కమల. విస్తుపోయాడు వెంకటేశ్వర్లు. అమ్మను కేకవేయాలిసి వచ్చింది. అమ్మవచ్చి ఆ పిల్లను రెక్కపట్టుకొని తీసుక వెళ్ళింది. ఆ పిల్ల కళ్ళు తరువాత చూసినప్పుడు మంకెన

పువ్వులంటే ఇలా వుంటాయి అని చెప్పాయి. ఆ తరువాత ఆవాళ కంచం దగ్గర వెంకటేశ్వర్లు నోటిమీదుగా వచ్చిన ఆ మాటలు, కమల మరచిపోయేదాకా ఎవరైనా చూస్తారనుకున్నప్పుడు తప్ప, తన రెండు చేతుల ఉపయోగమూ, అతడి కంఠాన్ని పెనవైచుకోవటమే తప్ప, ఇంకేమీ కాదని అతడికి రుజువు చేసింది. విచ్చీవిచ్చని మల్లెమొగ్గలా, అమాయకత్వానికి అర్థంలాగు, ప్రేమకు మారుపేరులాగు, ఆమె నిద్ర పోతూవుంటే, సంపంగిపూల రెక్కలవలె వున్న ఆ కనుబొమలనూ, తనను యెప్పుడూ పసివాణ్ణిచేసే ఆ కళ్ళనూ చూస్తూ మనస్సులో క్షీరసాగరమధనవేళా సముద్భూత కోలాహలము సందడిపెట్టగా, అంటీ అంటకుండ, తాకీ తాకకుండా, ఆ పాదాలు కళ్ళతో పెదాలతో స్పృశించేవాడు అతడు.

ఇవాళ వాళ్ళిద్దరూ కొండపైన మెలికలు మెలికలు తిరుగుతున్న రోడ్డుమీద పోతున్న ప్రయాణీకుల బస్సులో ప్రయాణం చేస్తున్నారు. ఆ బస్సు దేవస్థానంవాళ్ళ బస్సు. వాళ్ళు దేవుణ్ణి చూడటానికి పోతూ వున్నారు. ఆ దేవుడెవరూ? ఆపద మొక్కులవాడు అట! అందరూ అనుకుంటారు? అనుకోవటమేం! కమలకు తెలిసేపోయింది. అందుకే ఇప్పుడు వాళ్ళు వెడుతూంట. ఆ దేవుడి పాదాలు కొలుచుకో వద్దూ? తమ బ్రతుకులను ఆయన సేవకై వినియోగించుకోవద్దూ?

ఇంకా ఉదయం ఎనిమిదిగంటలు కూడా కాలేదు. చల్లనిగాలి శరీరాలను తాకుతూ మనస్సుని ఉల్లాస పరుస్తోంది. అక్కడ ఏ పుట్ట చూసినా, గుట్ట చూసినా, పువ్వు చూసినా, ఆకాశంపైన పరిగెత్తే మేఘాన్ని చూసినా, దూరంగా యెండపొడ చూసినా, భగవంతుని చిద్విలాసమే స్ఫురిస్తోంది. ఇవన్నీ భగవంతుడి సామీప్యంలో వుండటం వల్లనే వీటికింత అందమేమో మరి. ఇక్కడి గాలి కూడా భగవంతుణ్ణి గురించే చెపుతోందే అనుకున్నాడు వెంకటేశ్వర్లు. ఈ భావనతో అతడి

ఎద అంతా యేదో నిండినట్లైంది. కళ్ళలో చెమ్మ కదిలింది. కమల చూడకుండా ముఖాన్ని ఇంకా ప్రక్కకు తిప్పుకోవడం ఎలానో వెంకటేశ్వర్లుకు తోచలేదు. మఫ్లరును అతడి చెవులచుట్టూ లాగడం యెలానో కమలకు తోచలేదు. విసుగు వచ్చింది.

తన పక్కనే యెవరో అవ్వగారు కూచుని వున్నారు. బస్సు మలుపు తిరిగినప్పుడల్లా తాను ఆయన్ను అతుక్కునిపోతూవుంటే అవ్వగారు నవ్వుతోంది అంచేత కమలకు సిగ్గుగానూ వుంది. ఎవరూ చూడలేదనుకుని ఆ మఫ్లర్ కాస్తా లాగేద్దామనీ అనుకున్నా, ఆ పని చెయ్యలేక పోయింది. బస్ పోతూనే వుంది. ప్రయాణీకులు మధ్యమధ్య హర్షాతిరేకం వలన, భక్త్యుద్రేకం వలన, గోవిందా, గోవిందా అంటు న్నారు. వెంకటేశ్వర్లు యేమిటో మహా ఆనందిస్తున్నవాడిలాగా, తల బాగా అవతలకి పెట్టి ఆ చలిగాలినంతా ఆస్వాదించడం కమలకు యేమీ ఇష్టం లేకపోగా, కోపం కూడా వచ్చింది. "ఇదుగోనండీ బాబూ, మిమ్మల్నే! ఆ మఫ్లర్ కాస్తా చెవులచుట్టూ చుట్టుకోండి. చల్లగాలి తగులుతున్నది" అని చెప్పింది. వెంకటేశ్వర్లు పక్కకు తిరిగాడు. కమల మళ్ళీ చెప్పింది. "అసలే అడివిగాలి, మీ వొంటికి మంచిది కాదు. రేప్పొద్దుటనుంచీ హాచ్, హాచ్ మొదలు. అంతటితో ఆగుతుందా? తల నొప్పిగావుందే! ఒళ్లు వెచ్చగా వున్నట్లుందే! భగవంతుడు నాకు మళ్ళీ పరీక్ష మొదలెడతాడు!" ఈ ఉపన్యాసానికి వెంకటేశ్వర్లు జడుసు కున్నట్లుగా ముఖభంగిమ పెట్టి "చెవులచుట్టూ చాలునా, ముక్కు చుట్టూ కళ్ళచుట్టూ కూడా చుట్టుకోందునా?" అన్నాడు విసుగ్గా. "చాల్లెండి సంతోషించాం గాని, కాస్త లోపలకు జరిగి కూచోండి. ఏమి టుంది. ఎంతదూరం చూసినా, ఇవే అవపడుతూవుంటాయి." వెంక టేశ్వర్లు మరి మాట్లాడలేదు. ఆమె చెప్పినట్లే చేశాడు. ఆయనకు కోపం వచ్చేలాగు ఇక యెప్పుడూ మాటాడరాదని కమల అనుకుంది. కాని,

ఆయనకు ఇంతకే కోపం వస్తూ వుంటుందని తనకు తెలుసాయె! ఆయనకు కోపం తెప్పించకుండా వుండటం యెలా? ఈ కోపం యెంత సేపు నిలిచేనులే, అదీ చూస్తాను గదా! అనుకుంది కమల. ఆమె హృదయం ఇప్పుడు ఆనందంతో పరవళ్ళు తొక్కుతోంది. నరనరాన ఆనందం పొంగిపోతున్నది. ఎందుకో ఇంత సంతోషం? ఎందుకా? స్వామి వద్దకు వచ్చాం కాదూ! 'ఇక నాకు యే చింతలూ లేవు. ఏ కోరికలు లేవు. నీ పాదాల దగ్గరకు వచ్చాం. మమ్మల్ని కరుణించు' అని మనసులో పదేపదే అనుకోసాగింది కమల.

బస్ కొండపైకి వచ్చేసింది. ఇళ్ళ పైభాగాలు కనబడసాగినయ్. దూరంగా గోపురాగ్రాలు కూడా కన్పిస్తున్నాయి. కమలకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. నా స్వామీ, ఇన్నాళ్ళకు నీ సన్నిధి లభించింది మాకు నా తండ్రీ. ఇప్పుడు నిన్నేమి అనను. అనకూడదు. చూడుమరి. పిల్లలు ఒకవేళ తప్పుచేస్తారు. తెలిసోతెలియకో, అందుకని మనం వాళ్ళను కసురుకుంటామా? ఇలా యెన్నెన్నో ఆలోచనలు కమల మనస్సును సందడి పెడుతున్నాయి. బస్ వచ్చివచ్చి ఆగిపోయింది. కొంగుతో కళ్ళుతుడుచుకుని గోపురంవేపు చేతులెత్తి నమస్కారం చేసింది కమల. తరువాత ప్రయాణీకులందరితో పాటుగా వాళ్ళూ బస్ దిగిపోయారు. "చూశారా, ఆ గోపురం ఎంత యెత్తుగా కనబడుతుందో! ఏదీ, ఒక్కసారి నమస్కారం పెట్టుకోండి" అంటూ కమల అతడి కళ్ళల్లోకి చూసింది చప్పున. "ఏమిటండీ, కళ్ళు అలా ఎఱ్ఱబడిపోయి నాయి." అని తొట్రుపాటు సూచించే కంఠస్వరంతో "త్వరగా గది సంగతి కనుక్కోండి. రామరామ! ఇంతకంటే చంటిపిల్లలు నయం. ఏంచేస్తాం మరి, ఇంతకూ ఇది నా అదృష్టం" అంది.

వెంకటేశ్వర్లకు ఆపుకోలేని నవ్వు వచ్చింది. అది చూసి కమల కూడా పెదవుల పైకి తోసుకొని వస్తున్న నవ్వును తొక్కిపట్టి"ఏమిటట! ఆ సంతోషం ఎందుకు? నేనిప్పుడేమన్నానని, ఎందుకలా నవ్వుతారు? ఇక ఆపుకోండి. బావుంది సరసం. ఏమన్నానని? చంటిపిల్లలు నయమనా? బావుంది సంబడం. అయ్యో రామా! మీకేం తెలుసు మీ సంగతి!" అంది.

వెంకటేశ్వర్లకు కోపం రాలేదు. ఆ సంగతి కమలకంటే తనకే బాగా తెలుసు ననుకున్నాడు మనస్సులో.

"చంటిపిల్లలంటే నాకు నవ్వొస్తున్నది మరి. చంటి పిల్లలుంటే ఇంత రికామిగా యెలా వచ్చేవాళ్ళం? అదిసరే పోనీ, ఇక్కడ నాకు తెలిసిన పెద్దమనిషి ఒకాయన వుండాలి. వెళ్ళి గది సంగతి విచారించి వస్తాను. ఇక్కడనే కూచుని వుండు" అని చెప్పి వెంకటేశ్వర్లు వెళ్ళిపోయాడు. అతడు వెళ్ళిపోగానే అతడన్న మాటలు గుర్తొచ్చి కమల నవ్వుకుంది. ఇలానే ఒకసారి ఆయన ఒక చిత్రమైన ప్రశ్న అడిగారు తనవొళ్ళో పడుకొని. "నిన్ను నమ్మకూడదు కమలా! ఇప్పుడు నేను నిలుచున్నా, కూచున్నా, పడుకున్నా, నడిచినా, చదువుకుంటున్నా, ఆఖరుకు బట్టల రంగునుంచీ, నీ ఇష్టమే చెల్లుతున్నది కదా? నేను మరి....మరి" ....మరి మరీ మరీ ... అని నవ్వింది! అతడి ముఖం వేపు చూస్తూంటే తనకు ముచ్చటయింది. సిగ్గుతో అతని ముఖమంతా ఎఱ్ఱబడి పోయింది. తన వాలకం చూసి ఆయనకు కోపం వచ్చింది. ముఖం ప్రక్కకు త్రిప్పుకున్నారు. తానప్పుడు బుద్ధిమంతురాలి లాగా, "క్షమించండి నవ్వను కదా! అంటూ తన చెవిని అతని నోటివద్దకు చేరుస్తూ నవ్వింది. రహస్యం మరి" అన్నది.

"నే చెప్పను."

"మీరు చాలా మంచివారట."

"కాకపోయినా ఫరవాలేదు."

"చెప్పకపోతే ఒట్టు."

అప్పుడు చెప్పారు. "మరీ.... రేపు పాపలు పుడితే అప్పుడు కూడా నన్ను ఇలా కనుక్కోగలవా? కనుక్కోవు. మీ లోకం వేరు. అంచేత అప్పుడు నా బట్టలేవో నాకు తెలీవు. నాకాకలైన సంగతి కూడా నాకు తెలీదు. నిజమే. అంచేత అప్పుడు నేను ఒంటరివాణ్ణై పోతాను కాబోలు. నన్ను స్వయంగా ఆలోచించుకోనీ, నన్ను బాధ పెట్టకు కమలా! కొంచెం కొంచెం ఇప్పట్నుంచీ తెలుసుకోలేకపోతే అప్పుడు నాకేమీ తెలీవు. ఎన్ని బాధలు పడాలో. కాబట్టి రేపటినుంచీ నన్ను బాధపెట్టకు."

కమల మరీ దగ్గరగా అతుక్కుపోయి "మీరు చెప్పిందేమిటో నాకు వినపడలేదు" అంది.

వెంకటేశ్వర్లకు కోపం వచ్చింది. "అయితే చెపుతున్నాను విను. రేపటినుంచీ నా విషయాలు యేవీ నువ్వు కనుక్కోవద్దు. నేనే తెలుసుకుంటాను. మొదట రెండు రోజులు కష్టంగా వున్నా తరవాత అదే అలవాటయిపోతుంది. రేపటినుంచి నువు నాదగ్గరికే రావద్దు."

దీనికి కమల నవ్వుతూ సమాధానం చెప్పింది:

"తొందర పడకండి. ఆ రోజులూ వస్తాయి. ఎప్పుడో తెలుసా, అమ్మా, నాకీ చొక్కా వద్దు. ఆ పెట్టెలోది కావాలి - నాకు చాక్లెట్లు పెట్టవేవ్....ఆ....ఉంగా .... ఉంగా ఉళఊ....హాయీ .... అప్పుడు."

వెంకటేశ్వర్లకు కోపం వచ్చింది. విరిసివున్న గులాబిపువ్వులా వున్న ఆ ముఖాన్ని అవతలకు నెట్టివస్తూ "పో పో, పాపిష్టిదానా!" అన్నాడు.

కమల కావిషయం ఇప్పుడు గుర్తువచ్చింది. పాపం, ఆ క్షణంలో వెంకటేశ్వర్లు మనస్సులో ఏమనుకున్నాడో ఆమె కెలా తెలుస్తుంది? కమల అలా వెక్కిరిస్తుంటే, వెంకటేశ్వర్లు ఆ అంతర్యామికి మనస్సులోనే రెండు చేతులు జోడించి నమస్కరిస్తూ ''నిజంగా అలాంటి సందర్భాల్లో కమల అలానే ప్రవర్తిస్తుందేమో మరి. అదే నిజమైతే అలాటి కోరికలు నాకేమీ లేవు'' అని చెప్పుకున్నాడు. ఆ క్షణంలో వెంకటేశ్వర్ల మనస్సుని ఆమె చదవగలిగి ఉన్నట్లయితే, అలా యెన్నటికీ పరిహాసంగా మాట్లాడగలిగివుండేదికాదు అవాళ. దూరంగా యెవరో భజనబృందంవాళ్ళు పాడుకుంటూ వెళుతున్నారు. కమల అనుకుంది. ''ఎంత బావుందో ఇక్కడ. ఇక్కడే యెప్పుడూ వుండేవాళ్ళు యెంత అదృష్టవంతులో. చుట్టూ కొండలు. మబ్బులు. ఎటుచూసినా పచ్చని చెట్లు. గోపురాలు. భజనలు. కీర్తనలు. ఎక్కడ చూసినా కోలాహలం. ఏడుకొండల వాడా. వెంకటరమణా. నీ పాదాల వద్దకు తీసుకుని వచ్చావురా మమ్మల్ని. నా తండ్రీ! చిన్నప్పుడు అమ్మ చెప్పిన పద్యం గుర్తొస్తున్నది. 'నీవే తల్లివి, తండ్రివి'.... అని. వెంకటరమణా! నీ చల్లని చూపుకోసం ఇంతదూరం వచ్చామురా."

కమల మనస్సునిండా యేమిటో దివ్యభావన నిండినట్లైంది. పరవశించిపోతోంది మనస్సు. భగవంతుడికి మనస్సులో యెన్నిమార్లు నమస్కరించుకుందో! ఆ అనుభూతి ఇలాటిదని వర్ణించటం యెవరి తరమవును? ఆర్ద్రమైన చిత్తవృత్తి ఆమెది అసలు. ఎంత చిన్న సంఘటనకైనా విహ్వలించిపోతుంది. ఒకరోజున ఒకానొక అద్భుతమైన దృశ్యం చూచిందామె. అది యేమీ లేదు. ఏమీ లేదంటే, ఇతరుల దృష్టికి యేమీ లేదనిపించవచ్చు. వాళ్ళ పెరడు చాలా విశాలమైంది. రకరకాల పువ్వుల చెట్లున్నాయి. ఒకరోజు ఉదయం యెందుకో ఆమె పెరట్లోకి వచ్చింది. అత్తగారు కార్తీక స్నానాలు చేస్తారు. ఆమెకేమైనా

అవసరం వుండి పిలిస్తే వచ్చిందేమో మరి. అప్పటికింకా పూర్తిగా తెల్లవారలేదు. అయితే చీకటిమాత్రం యేమీలేదు. మంచు పడుతోంది కొంచెం కొంచెం. అప్పుడు చూసింది ఆమె ఆ దృశ్యాన్ని. పెరట్లో పారిజాతపు చెట్టుంది. వెన్నెల రాత్రిళ్ళలో అత్తగారూ, ఆయనా చూసి కూకలేసినాగానీ, తెల్లని సిల్కు మఫ్లర్ తలచుట్టూ చుట్టుకుని ఆ పారిజాత పువ్వుల చెట్టుకింద కొంచెంసేపు నిల్చుని వచ్చేది. ఆ పువ్వుల వాసనంటే తనకంత ప్రాణం. అలా కాసేపు ఆ చెట్టుక్రింద నిల్చుని ఇన్నిపూలు గుప్పిళ్ళలో పట్టుకునివెళ్ళి ఆయనమీదకు విసిరితే, ఆయన యేమనేవారంటే— "ఇప్పుడు నువ్వెలాగున్నావో చెప్పనా కమలం? సరిగ్గా చెప్పనా? ఎలాగున్నావంటే పెద్ద పారిజాత పుష్పంలా గున్నావు. ఎట్టిని కాడవున్న చిన్న తెల్లని పూవులా వున్నావు. ఏది ఇలారా. నిన్ను కళ్ళకద్దుకుని తలపైన పెట్టుకుంటాను." కమల ముగ్ధంగా నవ్వి, "ఎందుకూ, ఇలా తలపై కెక్కించుకునేవాళ్ళు ఎప్పుడో క్రిందపడతోయనూ తోస్తారు. నాకీ అదృష్టం చాలును. ఈ పువ్వు మీ కాళ్ళదగ్గరే పడివుంటుంది. నెత్తికెక్కదు" అంది. ఆయన అప్పుడు తనని కళ్ళలో నింపుకునేవారు. తనకు సమాధానం చెప్ప లేనట్లు చూసేవారు. ఆ కళ్ళలో నవనిధులూ పొందినంత తృప్తి. దేవుణ్ణి చూసినంత శాంతి. ఇంతకూ ఆ దృశ్యం యేమిటో- చెప్పాను కాను.

ఆవాళ ఆ అందమైన ఉదయం పారిజాతపు చెట్టు విరగబూసి వుంది. రకరకాల రంగురంగుల ముగ్గులు పెట్టినట్టు చెట్టుకింద పూలు పడివున్నాయి. తక్కిన చెట్లన్నీ వున్నా లేనట్లే వున్నాయి. ఆ దృశ్యం యెంత మనోహరమైందో చెప్పలేము. ఆ అందమైన ఉదయాన అంత అందమైన దృశ్యం! కమల పరుగు పరుగున వెళ్ళింది. గోల పెట్టింది. గుంజింది, లాగింది. జుట్టు సుతారంగా లాగింది. ఎలాగైతేనేం అతణ్ణి లేపింది. "ఏమిటే నీ ఆగడం?" అని విసుక్కున్నాడు వెంకటేశ్వర్లు.

"మీకు దండం పెడతాను. ఒక్కసారి నాతో పెరట్లోకి రాండి" అంది కమల. ఎలాగూ తప్పదని ఆమెను వెంబడించాడు వెంకటేశ్వర్లు. అక్కడ ఆ దృశ్యం చూశాడు. భుజాలమీద అలా చేతులువేసి "ఎంత చక్కని దృశ్యమే" అని చెప్పాడుకాదు. కమల హతాశురాలైంది. ముఖం ముడుచుకుంది. అతడు కనీసం మంచుకు తడిసిన పద్మంలా వున్న ఆమె ముఖంకేసి చూడనైనా చూడలేదు. కాబట్టి మరీ నిరాశురాలైంది. "ఏమిటే గాభరాపెట్టేశావు!" అనుకుంటూ వెంకటేశ్వర్లు వెళ్ళి మళ్ళీ నిద్రపోయే ప్రయత్నం చేస్తుంటే ఆమెకు యేడుపొచ్చినంత పనైంది. అలాంటి కమలకు ఇవాళ ఇక్కడ చుట్టూ కొండలు, మబ్బులు, చెట్లు, చేమలు, చల్లని గాలి, ఎండపొడ, కష్టాల్లో వున్న మనుష్యుల ఆర్తితో కూడుకున్న ప్రార్థనలు, కష్టాలు తీరిపోయినవాళ్ళ ప్రార్థనలలోని కృతజ్ఞత పుట్టిపడే భక్తిభావాలు- ఆమె మనస్సు యెలా గుండేను! గంపలతో జాజిపువ్వులు తెచ్చి మీద కుమ్మరించినట్లుగా వుంది. అంత ఆనందాన్ని మనస్సున నిబ్బరించుకోలేకుండా ఉంది. క్షణక్షణానికీ కళ్ళు నది అవుతున్నాయి. మనస్సున స్వామి కాంతిపడి నిండుతున్నట్లనిపించింది. అనంతమైన తృప్తితో ఆకాశమంత శాంతితో ఆమె కూచుని వుంది పెద్ద నందివర్ధనం పువ్వులా. మనసులో కోటి కోటి చందమామల వెలుగైన మూర్తిని స్మరిస్తూ ఇలా ఇలా ఆలోచిస్తూనూ, రమణా, తండ్రీ, ప్రభువా!

నీ చల్లని చూపుకోసం ఇంతదూరం వచ్చామురా!

ఈ ప్రపంచం ఇలా మళ్ళీ పచ్చగా కనిపిస్తుందనీ, మనుషుల వేపు చూసి సంతోషిస్తానని, మళ్ళీ యీ ఆకాశం, యీ మబ్బులు, యీ గుళ్ళు, గోపురాలూ చూస్తాననీ నేను అనుకోలేదు సుమా! నీ దయ అనుకో ఇదంతా - అమ్మో! ఆ క్షణాలు తలుచుకుంటే తానేమై పోతానో అనిపిస్తున్నది. ఆ క్షణాలు చచ్చిపోయినా మరచిపోలేదు తాను.

ఎంత బరువుగా గడచిపోయేవి ఆ రోజులు. గడియారపు ముళ్ళు యెంత నిలకడగా తిరిగేవి. ఎంత భారంగా పొద్దు గ్రుంకటం జరిగేది. ఎవరో వొకరు వస్తుండేవాళ్ళు. వాళ్ళు వెళ్ళిందాకా తాను అవతలకు పోవాలి. వీళ్ళు యెప్పుడు వెళ్ళిపోతారా దేముడా అని తనకు దుఃఖం వచ్చేది.

ఆ వచ్చినవాళ్ళు తీరుబాటుగా కూచుని ఆ మంచంమీద నీరసంగా వున్న మనిషిని "వెంకటేశ్వర్లూ,నన్ను గుర్తుపట్టావా?"అని పలకరిస్తూంటే తనకు తల గోడకేసి మొత్తుకోవాలనిపించేది. వీళ్ళు మనుషులేనా? తనను ఆయన దగ్గర కూచోనివ్వరు.

డాక్టరుగారు వచ్చేవారు. సరిగ్గాసాయంకాలం ఐదున్నర కాగానే. లైటు వెలిగించేదితను. రోజూ మామాలు పాఠం.

"అమ్మాయీ, భయం లేదమ్మా! అయ్యో పిచ్చిదానా! ఇలా చూడు. నా జుట్టు చూడు. ఎంత తెల్లబడిపోయింది. ఇలాటి కేసులు.... ఇన్ని చూశాను" అని జుట్టు గుప్పిట పట్టుకొని "చూడమ్మా పిచ్చితల్లీ! పదిహేనురోజులు తరువాత మీరిద్దరూ అలా సినిమాకు వెళుతూ మా ఇంట్లో వో కప్పుకాఫీ తాగిపోదురుగాని. నువు ధైర్యంగా వుండమ్మా! నువు ధైర్యంగా లేకపోతే, నువు యేడుస్తుంటే నా తల సరిగా పనిచెయ్యదు. ఇక మందెలా ఇస్తాను?" అని యెంతో ధైర్యం చెప్పేవారు. ఓదార్చేవారు. తరవాత వెళ్ళిపోయేవారు

తరవాత మళ్ళీ ఆయనగారి పిచ్చి పిచ్చి కేకలు, అరుపులు, అందర్నీ తిట్టటం,స్పృహలేకుండా పోవటం, మళ్ళీ డాక్టర్లు, యేడుపులు 'ఏమండీ! ఏమండీ!!'

ఎప్పుడో స్పృహ వచ్చేది. "ఏం కావాలండీ! నేను కమలాన్ని."

అయినా తిట్టేవారు. కేకలు పెట్టేవారు.

చుట్టుపక్కల నలుగురమ్మలక్కల పరామర్శ!

అయ్యో రామా! జీవితంలో అలాంటి కష్టపు ఘడియలు పగ వాళ్ళకైనా వద్దు. ఎవ్వరికీ వద్దు. రోజూ యెన్నిసార్లు గుండె కోసుక పోయేది! ఎంత తపించాను. ఆకలిలేదు. నిద్ర లేదు. ఎలా బ్రతికింది తను. అందరూ వచ్చి బ్రతిమాలటం - "ఎంగిలి పడమ్మా! ఎంగిలి పడకపోతే యెట్లా! చూడు ఇప్పటికే యెలా అయిపోయావో.'' వాళ్ళతో తలనొప్పి వచ్చేది. వాళ్ళ వాగుడు భరించలేక, ఇష్టం లేకపోయినా, తనకు చావుగా వున్నా ఇలా పళ్లెం ముందు కూచుని అలా లేచి వచ్చేసేది తాను. అవన్నీ తలచుకుంటేనేచాలు, భయంతో శరీరం గడ్డకట్టుక పోతుంది. ఇంకెందుకు భయం. ఇక యే భయమూ లేదు. వచ్చాంకదా చల్లని చోటుకు, భగవంతుని పదసన్నిధికి అని భయమంతా తీరిపోయి నట్లుగా నిట్టూర్చింది కమల.

"ఈయనగారు ఇంకా రాలేదేమిటి చెప్మా! గది యేదైనా దొరికిందో లేదో" అనుకుంటూ వున్నది కమల. అక్కడ అందరూ వుండి పోయారు కాబట్టినీ, తాను యెదురుగానే వస్తున్నాడు కాబట్టినీ వెంకటేశ్వర్లు వచ్చి కమల కళ్ళుమూయలేదు. వస్తూ వస్తూనే చూశాడు. ''ఓ కన్నీళ్ళ దేవతా! ఎందుకే కళ్ళు తుడుచుకుంటున్నావు? అదుగో చూడు. ఆ యెత్తుగా గుట్టలా కనపడటం లేదూ! దానిమీద గది ఇచ్చారు మనకు. నాలుగు రోజులు ఉండవచ్చునట. లే, వెళదాం" అని చెప్పాడు

కమల లేచింది. ఇద్దరూ ముందుకు నడిచారు.

ఆనందం యెక్కువైతే కూడా కన్నీళ్ళు వస్తాయి కాబోలు. మనసు పట్టలేని యే అనుభూతియైనా కన్నీళ్ళు తెప్పిస్తుంది కాబోలు అనుకుంది కమల. కాటేజ్‌కి వెళ్ళే దారిలో ఆమెకు స్వామిదర్శనం చేసుకుని వచ్చిన వాళ్లూ, చేసుకోటానికి వెడుతున్న వాళ్లూ, పసుపు బట్టలతో మొక్కులు తీర్చుకోవటానికి వెడుతున్న వాళ్లూ, తల నీలాలు

అర్పించుకునేందుకు ముడుపు కట్టుకుని జుట్లు పెంచుకున్నవాళ్లూ, స్వామికి తల నీలాలు ఇచ్చినవాళ్లూ యెందరో కనిపించారు. వాళ్ళంద రినీ చూస్తుంటే జాలీ, ప్రేమా, దయా, సానుభూతీ సందడించగా కడుపు తరుక్కుపోయింది కమలకు పాపం, వీళ్ళంతా యెంతెంత దూరంనుండి వచ్చారో - ఎన్నెన్ని కష్టాలు పడ్డారో - ఎన్నెన్ని ఆపదలు అనుభవించారో-నా స్వామీ, వీళ్ళందర్నీ చల్లగా చూడు. వీళ్ల ఏమేమి కోరుకుంటారో అవన్నీ ఇవ్వు. వీళ్ళకు దుఃఖం లేకుండా చెయ్యి. పాపం, వీళ్ళందరూ మంచివాళ్ళు. నువ్వేమో గొప్పవాడివి! మరి వీళ్ళందర్నీ సంతోషపెట్టు అనుకుంది కమల.

ఇంతలోకే వాళ్ళు కాటేజ్ దగ్గరకు వచ్చేశారు.

కమలకు నవ్వొచ్చింది తన ఊహకు.

"ఏమండీ దేముడుగారూ, ధూళిదర్శనానికి పోదాఁమా మరి" అని నవ్వింది యెంతో తృప్తిగా.

వెంకటేశ్వర్లు పకపకా నవ్వాడు. ఆపుకుని "ఓహో, ఓహో, తెలిసిందిలే నాకు. నేనా దేముణ్ణి. మరి నువ్వు అమ్మవారివి కాదుటే, నేను దేవుణ్ణైతే, ఉండుండు, నాకేదో జ్ఞాపకం వస్తున్నది. ఏమిటి చెప్మా ఆ శ్లోకం. కమలాకాంతానాథా....అరే,తరువాత జ్ఞాపకంరావటం లేదు అన్నాడు. అక్కడవుండే కుఱ్ఱవాడు గది తాళంచెవులు ఇచ్చి వెళ్ళాడు. అతడు తాళం తీస్తూవుండగా కమల అన్నది: "మీకు ఒకటి గుర్తు వుంటుంది కనుకనా ఇది గుర్తు వుండటానికి! మీకు యేదీరాదు, ఒక్క నన్ను దుఃఖపెట్టటం తప్ప."

వెంకటేశ్వర్లకు కోపం వచ్చింది. వచ్చినా ఆమెను అనునయి స్తున్న స్వరంతో, "అలా అన్యాయంగా మాట్లాడకు మరి. దేవుడి దగ్గరక్కూడావచ్చాము" అన్నాడు.

ఈ లోపున వెళ్ళి కుర్చీల్లో కూలబడ్డారు ఇద్దరూ. చిన్న ట్రంకు పెట్టి, బెడ్డింగూ కూలి మనిషి తెచ్చి లోపలపెట్టి చిల్లర తీసుకుని వెళ్ళిపోయాడు. "అవునండీ, నాకూ తెలుసు. చెప్పండి మరి. నేను చెపుతాను" అన్నది కమల. ఎంతో బుద్ధిమంతుడైన చిన్న పిల్లాడిలా "చెప్పుమరి" అన్నాడు వెంకటేశ్వర్లు. కమల చెప్పింది, చెప్పండి అంటూ.

"వినా వేంకటేశం ననాథో ననాథః"

వెంకటేశ్వర్లు పకపకా నవ్వాడు. అలుపు వచ్చినంత నవ్వాడు.

కమల ముఖం కోపంతో ఎరుపెక్కింది. వెంకటేశ్వర్లు నవ్వటం ఆపుకుని "ఇదిగో నా పేరమ్మాయ్.... నా పేరు చెపుతున్నావు" అన్నాడు. కమలకూ్కూడా నవ్వొచ్చింది. పెళ్ళినాడు కూడా తలుపుల దగ్గర ఆయన సిగ్గుపడిపోయి తనపేరు చెప్పకుండా "నేనూ మా ఆవిడా వచ్చాం తలుపు తీయండర్రా" అంటే తనుకూడా మొండి తనానికి "నేనూ మా ఆయనా వచ్చాం, తలుపు తీయండి" అన్నది. అందరూ విరగబడి నవ్వారు. అప్పుడు ఆయన ముఖం చూడాలి. వెలుగుతున్న మతాబాలా అయింది. ఇంత తెలివికల పెళ్ళాం దొరికినందుకేమో! అప్పుడు చుట్టూ వున్న వాళ్ళకు విసుగొచ్చి ఇద్దరితో నాలుగుసార్లు చెప్పించారు పేర్లు. అదంతా ఇప్పుడు గుర్తు వచ్చింది. సరేలెండి. మీరూ మీ హాస్యమూ, అన్నట్లుగా చూసి—

"సుముఖం సుహృదం సులభం సుఖదం
స్వనుజంచ సుకాయ మమోఘ శరమ్
అసహాయ రఘూద్వహ మన్యమహం
నకదంచన కంచన జాతుభజే"

అని చదివింది కమల.

"చెప్పండి మరి. ఏమిటో మొద్దునైపోతున్నాను. చిన్నప్పుడు ఏడెనిమిదేళ్ళప్పుడు సుప్రభాతం, స్తోత్రం మొత్తం నోటికి వచ్చేవి. నాన్న యెప్పుడూ పాడించి వింటూ వుండేవారు.... ఇప్పుడేముందిమరి, రామా, కృష్ణా అనుకోవడానికూ్కడా తీరికా?...."

వెంకటేశ్వర్లకు కమల అలా పెద్దనాపసానిలా మాట్లాడేస్తుంటే నవ్వొచ్చింది. అన్నాడు: "అవును పాపం, ఇల్లాలు కష్టపడిపోతోంది, పదిమంది బిడ్డల తోటి."

కమల వుడుకో్కలేదు, నెమ్మదిగా శాంతంగా సమాధానం చెప్పింది:

"ఆహా, పదిమందిపెట్టు మీరొక్కరే చేస్తారు."

వెంకటేశ్వర్లు సిగ్గుపడిపోయాడు.

కమల రాగవరసన పాడుకుంది "అవనీతనయా కమనీయకరం, రజనీకరచారు ముఖాంబురుహమ్" అంటూ.

"మరి యేంచేద్దాం చెప్పు. ఆలయానికి వెళ్ళివద్దాం పద. ఆకలి కూడా అవుతోంది. ఇక్కడ స్వామివారి కాంటిన్ కూడా వుంది. ఆ ఫ్లాస్క్ ఇలా యిస్తే కాస్త కాఫీ, కొంచెం టిఫినూ పట్టుకవస్తాను" అన్నాడు వెంకటేశ్వర్లు. "నేనూ వస్తున్నాను పదండి. ముందు ధూళి దర్శనం చేసివద్దాం. తరువాత అవన్నీ చూసుకుందాం" అంది కమల.

ఇందాక వచ్చేప్పుడు చూడలేదు. వాళ్ళు ఇప్పుడుంటున్నగది వోచిన్నసత్రం లాంటి దానిలో వోపక్కన వుంది. దగ్గరదగ్గర పది గదులు వున్నట్లుంది అన్నీకలసి. విశాలమైన వరండా వుంది. అక్కడోటి అక్కడోటి కుర్చీలున్నాయి వరండాలో. కమల వరండాలో నిల్చుని ఆలయంవేపు చూసింది. సూర్యకాంతికి బంగారురేకులు తాపబడ్డ గోపురాలు ధగధగా మెరిసిపోతున్నాయి.

దూరంగా పాపనాశనానికి పోయే రోడ్డు వంకలు వంకలు తిరిగి, అందమైన అమ్మాయి అలవోకగా బుజాలమీదకు జారవిడిచిన వాలు జడలా వుంది. వరసనా లైట్లు వున్నాయి. ఆ లైట్లు వెలిగితే ఆ అమ్మాయి పెద్ద జడ వేసుకుంటే ఆ జడలో కుట్టిన మల్లెమొగ్గల్లా వుంటాయేమో! గోపురాగ్రాలపైన కోతులు అటూ ఇటూ గెంతుతున్నాయి. రాత్రంతా ఇక్కడ వో కుర్చీ వేసుకుని కూచుని ఆలయం వేపే చూస్తూ గడుపుతాను అనుకుంది కమల.

మెట్లు దిగి కిందికి వచ్చి వాళ్ళిద్దరూ ఆలయం వేపు నడిచారు. వాళ్ళు చేరేసరికి ఆలయంలో పూజాదికాలు ప్రారంభమైనాయి. ఎలానో టికెట్లు కొనుక్కుని వెళ్ళి, స్వామిని దర్శించాము అనిపించుకున్నారు వాళ్లు. వాళ్ళకు తృప్తికలగలేదు. కమల అన్నది: "పోనీలెండి. సాయంకాలం యెలాగూ వచ్చి స్వామికి పూజ చేయిద్దాము అనుకుంటూనే వున్నాం కదా. ఈ సారికి వెడదాం."

మళ్ళీ గదికి వచ్చేశారు. అతడు ఫ్లాస్కు తీసుకుని వెళ్ళబోతూ వుంటే "మీరిప్పుడేం పోనవసరం లేదు. ఎక్కువసేపు చన్నీళ్ళలో మునగకుండా ఒక్క నిమిషంలో స్నానం చేసిరండి. కాఫీ ఇస్తాను" అన్నది కమల. "చిత్తం చిత్తం" అని వెంకటేశ్వర్లు వెళ్ళిపోయాడు.

ఫ్లాస్కులో కొంచెం కాఫీవున్నది. వెంకటేశ్వర్లు ఆమె చెప్పినట్లు నిమిషంలోనే వచ్చాడు. ఆ కాఫీకాస్తా ఇచ్చింది కమల. తాను దూరంగా కుర్చీలో మౌనంగా కూర్చుండి పోయింది. వెంకటేశ్వర్లకు కమల కమలలా కన్పించలేదు. కరిగిపోయాడు ఏవేవో తలచుకుని. అవునా, ఆలోచిస్తుంటే విచిత్ర మనిపిస్తూ వుంటుంది. నేను బ్రతుకుతా ననుకున్నానా? ఏమిటో మరి అంతా భగవంతుని దయ. నా కమల నన్ను బ్రతికించుకుంది. "నా కమల లేకపోతే నేను బ్రతికేవాణ్ణా? నా కమలే నా బ్రతుకు. నా కమల లేకపోతే నా బ్రతుకే లేదు. ఆమే నా బ్రతుకు" అనుకున్నాడు వెంకటేశ్వర్లు.

"బత్తాయి పళ్ళరసం తియ్యనా అనీ" "తలగడలు సర్దుతాను కాసేపు మేను వాల్చండీ" అని మధ్య మధ్య కమల అజమాయిషీ చేస్తోంది. బెడ్డింగు పరిచాడు వెంకటేశ్వర్లు. కమల దగ్గరగా వచ్చి కాళ్ళప్రక్కను కూచుంది. "ఏమండీ! అమ్మవారి దగ్గఱకు యెప్పుడు వెళదాం? రేపా, యెల్లుండా, కాళహస్తికూడా వెళ్ళివద్దామండీ! ఎలానూ మద్రాసు తీసుకుపోతానన్నారు కదూ! అక్కడినుంచీ మహాబలిపురం కూడా తీసికెళ్ళాలండోయ్! సినిమాల్లో చూశాను. వాటిని గురించి చదవను కూడా చదివాను" అంది. వెంకటేశ్వర్లకు నవ్వొచ్చింది.

"అప్పుడే అయిపోయినట్లేనా, మధురా, చిదంబరమూ, కంచీ, కన్యాకుమారీ మొదలైన పుణ్యక్షేత్రాలు లేవూ? ఆ దేవతలంతా నీకోసం యెదురు చూస్తున్నారు." కమలకు నవ్వొచ్చినా కోపంకూడా వచ్చింది. విసుగుతో కూడిన ఒక రకమైన విరక్తిభావం కూడా కలిగింది. "మీకెప్పుడూ వేళాకోళమే లెండి!" అని మూతివంకరగా తిప్పుకొని యెటో చూస్తూ కూచుంది. అప్పుడు వెంకటేశ్వర్లు అనునయించాడు. "మరి నా సెలవ వారంరోజులే కదూ? ఇక్కడ నాలుగు రోజులు గడుపుదా మనుకుంటున్నామా! మరి యెలా వెళ్తాం? మద్రాసులో ఓ రోజుండి ఇంటికి వెళ్దాం"

"పోనీలెండి మహాప్రభూ! ఇక్కడకు రావటానికే తమర్ని వొప్పించేందుకు యెంత కష్టపడ్డానో! చాల్లెండి, తండ్రికి నామీద ఇంత దయ ఉన్నది చాలూ. ఇక నేనేం కోరను."

చప్పునలేచి ఆమె బుజాలచుట్టూ చేతులు చుడుతూ "తప్పకుండా తీసుక వెడతానే నువు కోరిన చోటుకల్లా."

"ఏం వొద్దులెండి"

"అదుగో అప్పుడే కోపం వచ్చేసింది."

"ఇది మరీబాగుంది, అయ్యోరాతా! నేను కోపం తెచ్చుకోవటం కూడానా, ఎవరి మీదా? ఎందుకూ?"

"నామీదే! ఎవరిమీద కోపం తెచ్చుకుంటే యెవరూరుకుంటారు చెప్పు. ఇదిగో అమ్మాయ్, చెపుతున్నాను విను. ఇవాళ సాయంకాలం ఆలయానికి వెళ్ళినప్పుడు - 'ఓ స్వామీ, మహాప్రభూ, నా తండ్రీ, మా ఇంట్లో ఒక పిచ్చిపిల్ల వుంది. ఎప్పుడూ ఒకటే కోపం. ఆ కోపం కూడా సరిగ్గా ముక్కుమీదనే వుంటుంది. ఆ కోపం కాస్తా పోగొట్టా వంటే మళ్ళీ వచ్చే సంవత్సరం యీరోజుకల్లా నీ దగ్గరకువచ్చి పూజ చేయిస్తాను' అని మొక్కుకుంటాను" అన్నాడు వెంకటేశ్వర్లు.

కమలకు వొంటినిండా చందనం అలదినట్లయింది. స్వామివారి అభయముద్ర తన నెత్తిన పెట్టినట్లయింది. మనస్సులో యెన్నెన్నో ఊహలు వచ్చి చేరినై.

ఆ మధ్యాహ్నం స్వామివారి కాంటీనునుండి భోజనం తెచ్చు కున్నారు ఇద్దరూ వెళ్ళి. కొంచెం సేపు మేనువాల్చారు.

కొండమీద సాయంకాలం మనోహరంగా వుంది. కోలాహలంగా వుంది. సంజ వెలుతురు పోకుండానే లైట్లు వెలిగినయ్. ఆకాశంలో ఒక వేపు రంగుల రంగుల మబ్బులు కదులుతున్నాయి. కమల తిధివారాలు గుణించుకుంది. ఇవాళ వెన్నెల వస్తుందా, రాదా అని. ఆమె మనసుకు యెంతో సంతోషమైంది. వెన్నెల్లో యీ గుళ్లూ, గోపురాలు ఎంత అందంగా వుంటాయో! అంతటా స్వామి దివ్యరూపమే సాక్షాత్క రిస్తుంది కాబోలు. పాపనాశనానికి వెళ్ళేదారిలో లైట్లు వెలిగాయి. ఆ వరస వరస యెంతో అందంగా కన్పిస్తోంది. ఆలయానికి వెళ్ళాలి కదూ. ఆయన ఇంకా మత్తుగా నిద్రపోతుంటే కమల లేపింది. స్నానాలు చేశారు. దుస్తులు మార్చుకున్నారు.

"ఆ పట్టుపంచె కట్టుకోండి. మరేం ఫరవాలేదు, స్వామిదగ్గరకు పోయేప్పుడు కూడా మీ ఆఫీసువేషం లేకపోతే" అన్నది కమల.

"సరేను. నువు కమలవు. నువు చెప్పినట్లు వినమనే శాస్త్రంలో కూడా వుంది."

"కనుక్కున్నారులేండి, ఎలా నైతేనేం!" పట్టుచీరకట్టుకుని తన అదృష్టం వెంటనడచి వస్తున్నట్లనిపించింది వెంకటేశ్వర్లకు. తన జన్మ జన్మాల పుణ్యం అనుసరిస్తున్నట్లు తోచింది. ఆలయానికి వెళ్ళారు.

ఆలయమంతా సందడిగా వుంది. ఎంతెంత దూరం నుంచి వచ్చారో, ఎన్నెన్ని కష్టాలు పడ్డారో, ఎంతమంది మనుషులో! ప్రదక్షిణాలు చేసేవాళ్లూ, సాష్టాంగ నమస్కారాలు చేసేవాళ్లూ, పొర్లుడు దండాలు పెట్టేవాళ్లూ, చిన్నచిన్న బిడ్డలు, పెద్ద పిల్లలు, ముసలివాళ్లూ, ఒకరని ఏమిటి? ఆలయపు ఆవరణలో అందరూ నిండిపోయారు. వైకుంఠ ధామంలా వుంది.

కమల క్యూలో వెంకటేశ్వర్ల వెనుక నిలుచుంది. మాటిమాటికీ వెనక్కు తిరిగి యేమిటి చెపుతారు! కమలకు నవ్వొస్తున్నది. అక్కడి దృశ్యాలన్నీ కనుల పండువుగా వున్నాయి. స్వామిదర్శనం చేసుకుని పూజాపునస్కారాలు జరుపుకునేసరికి చాలాసేపే పట్టింది. భగవంతుని దివ్యమంగళ విగ్రహం చూసేసరికి అన్ని కోరికలు తీరినట్లపించింది కమలకు. ఆయన పట్టిన అభయముద్ర అందర్నీ కాపాడుతుంది. ఆయన పాదాలు నమ్ముకున్నవారికి యెవరికీ భయాలూ, బాధలూ, లేములూ, యేవీ వుండవనిపించింది. మరయితే యీ మనుషులందరికీ, ఇన్ని బాధలూ, కష్టాలూ, ఇవీ యెందుకు? ఆయన పాదాలపైన వాళ్ళు తమ మనస్సులను అర్పించుకోలేదా? అర్పించుకునే వుండవచ్చు. పసిపిల్లాడు గుక్కపట్టి యేడ్చినప్పుడల్లా అయ్యోపాపం యేడుస్తున్నాడే అని తల్లి పాలు పడుతుందేమిటి? వాడి సంగతి ఆమెకు తెలీదా? అలానే భగ

వంతుడూ! నిజంగా మనకు యేవేవి, యెన్నెన్ని, యెప్పుడెప్పుడు అవసరమో, అన్నీ ఇస్తున్నాడు కదా? ఆయనకంటే మనకు యెక్కువ తెలుసునా? పసిపిల్లాళ్ళ మల్లేనే చికాకు పుట్టించుకునో, చిరాకుపడో, యీ మనుషులంతా ఏడుస్తూ వుంటారు. భగవంతుడూ తల్లిలా పట్టించు కోడూ? ఒక తల్లికి నలుగురు పిల్లలుంటే వాళ్ళ అవసరాలే ఆమె కనుక్కోలేదు మరి! ఇంత విశ్వ బ్రహ్మాండంలో కోటానుకోట్ల పిల్లల్ని ఆయన సముదాయించవద్దూ? కొంచెం జాగు చేస్తాడు అంతే.

ఆలయలోంచి వాళ్ళిద్దరూ బయటకు వచ్చారు.అక్కడ పొంగలి, దద్ధోజనం అమ్ముతున్నారు పూజారులు. కొంచెం తీసుకున్నారు. ఆవాళ శనివారం. తామిద్దరూ భోజనం చెయ్యరు. గదికి నడిచారు.

దారంతా గులాబీపూల రేకులపైన నడుస్తున్నట్లుంది కమలకు. వరండాలో కుర్చీల్లో కూర్చున్నారు. పిట్టగోడ దగ్గరకు కుర్చీ లాక్కుని కూచుంది కమల. వెంకటేశ్వర్లకు అప్పుడే నిద్ర వస్తున్నది. ప్రయాణం బడలిక యేమాత్రమూ తీరలేదు. "పిచ్చిదానా! ఇక్కడే రాత్రంతా గడుపుతా వేమిటి? చలిగా వుంది. మంచుకూడా పడు తోంది. లోపలికి వచ్చేసెయ్" అన్నాడు.

కమల అతడికేసి చేతులు జోడించి "నా జాగ్రత్త నేను పడతాను గాని తమరు వెళ్ళి పడుకోండి. కొంచెంసేపుండి నేను వచ్చేస్తాను. ఇప్పుడే పదినిమిషాల్లో వచ్చేస్తాను.మీ కళ్ళు ఇంకా ఎఱ్ఱగానే ఉన్నాయి" అంది. ఇక యెంత చెప్పినా అంతేనని వెంకటేశ్వర్లకు తెలుసు. లేచి లోపలకు వెళ్ళిపోయాడు. కమల మెరిసిపోతున్న గోపురాలవేపు చూస్తూ కూచుంది. ఆమెకు యెన్నెన్ని ఊహాలో వచ్చాయి. తనకు వచ్చిన పద్యాలన్నీ మనస్సులోనే మననం చేసుకోసాగింది. క్రమంగా ఆలయంవద్దా, చుట్టుపక్కలాకూడా జనం రద్దీకూడా తగ్గిపోయింది.

దూరంగా యెక్కడినుంచో మాత్రం భజనలు వినవస్తున్నాయి. కొంచెం చలిగా వున్నమాట నిజమే. అయినా, కమలకు లోపలకు లేచి వెళ్ళ బుద్ధి పుట్టలేదు. పమిటె భుజాలచుట్టూ చుట్టుకుని అలానే కూచుంది. అన్ని గదుల్లోనూ మనుషుల సందడి అణిగిపోయింది. అప్పుడొకరు, అప్పుడొకరు మాత్రం వచ్చి యెవరి గదుల్లోకి వాళ్ళు వెళుతున్నారు. దూరంనుంచి అలా భజన కీర్తనలు వినపడుతూ మనస్సుని యెంతో ఆహ్లాదపరుస్తూవుంటే, ఆ గంభీరమైన రాత్రివేళ, ఆమె మనస్సు యెన్నెన్ని ఊహలు చేస్తున్నదో యెవ్వరెరుగగలరు? దూరంగా రెండు చిటికేశ్వరపు చెట్లు ఎదురుబొదురుగా వెన్నెల్లో మెరిసిపోతున్నాయి. వాటి నీడలు ఆ సిమెంటు రోడ్డుపైన యెంత అందంగా వున్నాయో! ఎవరో బాటసారులు తలకింద మూటలు పెట్టుకుని నిద్రపోతున్నారు ఆ నీడల్లో, తల్లివొడిలో నిద్రిస్తున్న పసిపాపలకుమల్లే. అక్కడనుంచి కమలకు లేచి వెళ్ళబుద్ధి పుట్టలేదు. దూరంగా పాపనాశనానికి వెళ్ళే దారిలో కొండమీద లైట్లు బారునా వెలుగుతున్నాయి. అలానే చూస్తూ కూచుంది: దాంతో ఎన్నెన్నో ఆలోచనలు ముసురుకున్నాయి. కమల అనుకుంది. "ఇన్నాళ్ళకు తన కోరిక ఫలించింది. తన జీవితం ధన్యమైంది. తననుకున్నదా, మళ్ళీ తను బ్రతికి బాగుపడి, ఈ గాలీ, వెలుతురూ, ఆకాశమూ ఇవన్నీ చూస్తాననని! మేడమీది గది కిటికీలోంచి అంచరెక్కలవలెనూ, నందివర్ధనాల రెక్కలు కుప్పలు కుప్పలు బోసి నట్లున్నూ వున్న తెల్లని మబ్బుల్నీ మళ్ళీ తాను చూడగలుగుతా నను కున్నదా? అమ్మబాబో, ఆ రోజులను తలచుకుంటేనే తనకళ్ళు తడి అవుతున్నాయి. ఆ రోజులు యెంత భయంకరమైనవి. గుండె రాయి అయిపోలేదూ? ఏడవగలిగిన శక్తికూడా అయిపోలేదూ? కళ్ళలో పిచ్చి చూపు యేర్పడలేదూ? తన సర్వస్వం యేమైపోతుందోనన్న దిగులు. తన అదృష్టం యెలా పరిణమించనున్నదో అని భయం."

ఒక రాత్రివేళ మబ్బులు యెక్కడినుంచో కమ్ముకుని వచ్చి నానా బీభత్సంచేసి, హోరుమని గాలివీచి, చీకటిలో దయ్యాలు యేడ్చి, మళ్ళీ అంతా సర్దుకుని, విరిగిపోయిన చీకటి చెట్లమీద చందమామ కిరణాలు ప్రకాశించినట్లు, ఆకాశం తుడిచిపెట్టిన అద్దంలా వున్నట్లు తన జీవితంలోనూ భయంకరమైన ఆ క్షణాలు గడచిపోయి, ఇప్పుడు హాయిగానే బ్రతుకుతూ వుంది. ఇదంతా యీ స్వామి చలవ అనుకోవాలి. వీడి అనుగ్రహం. అసలు యీ స్వామి ప్రత్యక్షదైవం కదా! పిలిస్తే పలుకుతాడు కదా! ఆపదమొక్కులవాడు కదా! అవును. అత్తయ్య చెపుతారుకదా! చిన్నతనాన్నుంచీ ఇంతే కాబోలు యీయన? దృఢంగా ఆరోగ్యంగా వుండేవారు కారు కామోసు? చిన్నతనాన పెద్ద జబ్బుచేసిందట. అంతా అయిపోయిందనుకునే అనుకున్నారట. వేరే ఆశ లేనే లేకపోయిందట. అప్పుడు అత్తయ్యగారు "నా స్వామీ, వెంకటరమణా! యీ గండం గడిస్తే, ఈ పిల్లాడికి నీ పేరు పెట్టుకుంటాము. నీ దగ్గరకు వస్తాము. నిన్ను నమ్ముకుని వున్నాము" అని ముడుపు కట్టారుట. అదీ జరిగింది. ఇప్పుడూ అంతే. ఇక్కడకు వచ్చాం. తన మనసు యేమిటోనిండినట్లనిపిస్తున్నది. ఎవరిపైనా తనకిప్పుడు యీర్ష్యా, కోపమూ ఏమీలేవు. ఎంతో ఆనందంగా వుంది. నిజంగా తన అదృష్టం బావుండబట్టే ఇలా జరుగుతున్నది. భగవంతుడా! ఎన్ని చీకటిరాత్రులు ఆయన మూలుగును వింటూ, ఆ మందుల వాసనను భరిస్తూ, యేడ్చేందుకు కూడా శక్తిలేక, యేమౌతుందోనన్న భయంతో హృదయం గడ్డకట్టుకొనిపోగా, గడపలేదు! ఎన్ని వెన్నెల రాత్రులు రోడ్డుపైన నిద్ర గన్నేరు చెట్లపైన వెన్నెల పడుతుంటే, ఆ ప్రశాంతమైన వాతావరణంలో, దుఃఖంతో ఆ చిన్న లైటువెల్తురులో, ఆ గదిలో హృదయమంతా చీకటికాగా గడపలేదు! నిద్రరాదు. మనస్సు మొద్దుబారిపోదు. ఆలోచనల బారినుండి మనస్సును తప్పించుకోలేకపోయేది. పాడుపాడు

ఆలోచనలు వచ్చేవి. రోజులు యెలా గడిచిపోతున్నాయి అన్న జిజ్ఞాస వుండేదికాదు. ఏమి జరుగుతున్నది అన్న చింత వుండేదికాదు. అలా జరిగిపోయాయి ఆ రోజులు.

ఇవాళో? ఇవాళనా! ఇవాళ మరి ఇంత సంతోషం. భగవంతుడి దయ. మద్రాసు వెళతాము. అలా అంటారు కాని, తప్పక మహాబలి పురం తీసుకవెళతారు. మద్రాసులో నాతో స్కూలు ఫైనలు చదువు కున్న శ్యామల వుంది. శ్యామలను యెలా కలుసుకోవాలి? ఎలానైనా కనపడిందా, ఒక రోజైనా దానితో గడపవలసివుంటుంది. ఇంకా అమ్మ వారిని చూడాలి. కాళహస్తి వెళ్ళాలి. ఓహ్, ఎక్కడికైనా వెళ్ళవచ్చును. ఆ కొండకొమ్మున చందమామ యెంత అందంగా వున్నాడో! ఇదేం పాల వెన్నెలమ్మా! స్వామి సన్నిధానం కాబట్టి ఇలా వుందేమిటి? పుచ్చపువ్వులు పూసినట్లు,పిండి ఆర బోసినట్లు,బావుంది చాలా బావుంది. భజన వినరావటం లేదేమిటి చెప్మా? ఎప్పుడు ఆపేశారో, ఏమో! వాళ్లు అలా చిరుతలు వాయిస్తూ, సమ్మోహనకరంగా భక్తి గీతాలు పాడుతూ వుంటే, తనూ వెళ్ళి పాడాలనిపించింది. తనేమైనా మీరాబాయా? అంత అదృష్టమా! ఎన్నెన్ని జన్మల పుణ్యం పండాలి మీరాబాయి కావటా నికి! మీరాబాయి పద సన్నిధానానికి కూడా తను నోచుకోదు. తన కిప్పుడేం తక్కువ. మనిషి వున్నచోట వుండలేడు కాబోలు. ఎంత ఆశపోతుతనమో మనిషిలో. లేకపోతే కుళ్ళుబోతుతనమూ. ఛీ ఛీ! తనకు ఇక యే కోరికలూ లేవు.

"ఈయన నిద్రపోతూ వుంటారు గాబోలు! పసిపిల్లలంటే పొద్దున యెంత ఆర్భాటం చేశారూ? నిద్రపోతుంటే, యెంత ప్రశాం తంగా అమాయకంగా వుంటారో! ఎంతసేపు చూసినా, ఆ ముఖంకేసి అలానే చూస్తూ వుండాలనిపిస్తుంది. అదృష్టమే-ఇంత పెద్ద పసిపిల్లాడు తనకు దొరకటం." కమల ఇలా ఆలోచిస్తూ వుంది. అప్పుడొక సంఘ

టన జ్ఞాపకం వచ్చిందామెకు. "అవాళ ఆయన యెంత కృంగి పోయారో. దగ్గర బంధువులే. చిన్నతనాన్నుంచీ తనతో ఆడి పాడి కలిసి చదువుకున్న ఒక అబ్బాయి చనిపోయాడు. ఆ కళ్ళలో యెంత దిగులో, ఎంత భయమో! ఒళ్లో తలవుంచి 'ఏడుపు రావటంలేదు. ఎలా మరచిపోవాలి! ఏమిటో భయంగావుంది' అని తనకు చెప్పటం తను యెలా మరచిపోగలుగుతుంది యెన్నాళ్ళైనా! ఆ తరువాత వారం రోజులదాకా వెన్ను నిమురుతూ కూచుంటే తప్ప వీల్లేదనీ, తను అలా చేస్తే తప్ప నిద్రపోలేననీ, చిన్న పిల్లాడికి మల్లే బ్రతిమాలేవారు. ఆయనను నిద్రపుచ్చే తను నిద్రపోయేది. ఆ రోజులన్నీ అలా గడచి పోయాయి.

కమల ఇలా ఆలోచిస్తూ కూచుంటే, ఆమెకు తెలీకుండానే యెప్పుడో చిన్న కునుకుపట్టింది. అలా యెంతసేపు గడిచిందో తనకు తెలుసు. ఎవరో నడుంచుట్టూ చేతులు వేసి లేపుతున్నారు. మెళుకువ వచ్చింది. ఆయన బుజంమీద తల ఆన్చి నడిచింది. అర్ధరాత్రి దాటి నట్టుంది. గదిలోకి రాగానే బాగా చలి అనిపించింది. లైటువేసి తన తలమీద చెయిపెట్టి ఆయన విసుక్కున్నారు. "ఛీ,ఛీ ఇంత చిన్న పిల్లవై పోతున్నావేమిటి? చూడు తలంతా యెంత చల్లగా వుందో, మంచులో వద్దే అని చెపితే వింటేనా? ఎందుకు వింటావులే, అనుభవించు. ఊఁ, ఊఁ.... ఇక పడుకో. నవ్వొస్తున్నది. ఇంకా సిగ్గులేక."

కమలకు నిద్రమత్తు పూర్తిగా వదలిపోయింది.

చిన్నప్పుడు అన్నాలాట ఆడుకునేప్పుడో, లేక బొమ్మల పెళ్లిళ్లు జరుపుకునేప్పుడో, లేక ఆఫీసునుంచి ఆయన అనబడే ఆరేళ్ళ పిల్లవాడు అదిలేక ఒసేవ్ అనబడే ఐదేళ్ళ చిన్నపిల్లను కేకలువేయటం నటిస్తు న్నప్పుడో, వాళ్ళు అంటే ఆ పిల్లలు యెలా మాట్లాడుకుంటారో, అలానే వున్నాయి యీయనగారి మాటలన్నీ. ఇంకా వాళ్ళు నయం. వాళ్ళ

తల్లిదండ్రులు యెలా మాట్లాడుకుంటారో విని కొంచెమైనా ఆ మాటలు వొప్పచెప్పుకుంటారు. కమలకు నిద్రవదలిపోయింది. నవ్వువచ్చింది. ఒక టవల్ తీసుకుని దగ్గరగా వచ్చి ''కొద్దిగా తుడుద్దురూ, మీకు పుణ్యం వుంటుంది" అన్నది. వెంకటేశ్వర్లు కోపంతోనే ఆమె తల తుడువసాగాడు. ''ఎందుకంత నొప్పేటట్లు తుడుస్తారు? మరీ అంత కోపంగా వుంటే, ఒక మొట్టికాయ వేస్తే సరిపోలేదా?'' అన్నది కమల.

''ఆ! ఆ! నాకు తోడు అదికూడా, నువ్వు వెయ్యకుండావుంటే అంతేచాలు.''

తలమీది టవల్ లాగి అవతలగా విసరివేసి, అతడి బుజంమీద, తన ఒక చేతిని అలవోకగా మోపి, అతని బుగ్గలకు తన వెచ్చని నిట్టూర్పులు సోకుతుండగా ''ఇంతకూ స్వామిని మీరేం కోరుకున్నారో చెప్పారు కాదు" అన్నది.

వెంకటేశ్వర్ల కోపమంతా ఉఫ్‌న వూదినట్లైంది. పెదవులమీదకు చిరునవ్వు వచ్చింది. బెడ్డింగ్‌మీద ఒక పక్కగా ఆమెను కూచో బెడుతూ, తానూ కూచుంటూ, ''నువ్వు చెప్పు కమలా, నువ్వు యేం కోరుకున్నావ్? తరువాత నేను చెబుతాను'' అన్నాడు వెంకటేశ్వర్లు.

''ముందు మీరే చెప్పండి. తరువాత గాని నేను చెప్పను."

"నువుచాలా మంచిదానివట."

"అవును. నిజమే. మీకంటే చాలా మంచిదాన్ని."

"అందుకే ముందు చెప్పమంటూంట."

''కాదు మీరే చెప్పాలండీ! నేను కూడా చెపుతాను కదా!"

"లేదు, నువు చెపితేకాని నేను చెప్పను"అన్నాడు వెంకటేశ్వర్లు. అతను యేదో ఆలోచించకుండా అనేయటం, తాను బాధపడటం చాలా మార్లు జరిగిందే. అంచేత తానే చెపుదామనుకుంది కమల.

"ఇలా వంగండి, చెవులో చెపుతాను."

వెంకటేశ్వర్లు అలానే చేశాడు.

"ఎలా చెప్పేదమ్మా? సిగ్గవుతోంది."

"ఇదేనా దేవుణ్ణి కోరుకుంది?"

"మీరు నవ్వకూడదమ్మా! అలాఅయితే నేను చెప్పనే చెప్పను."

"నిజం. నేను నవ్వనుగా!"

"అదుగో, అప్పుడే నవ్వుతున్నారు."

"లేందే?"

"అయితే, అయితే, మరీ...." అంటూ కమల అతడికి మరీ దగ్గరగా వచ్చింది. అతడి హృదయానికి వినపడేట్లుగా, సిగ్గుగా, గారాబంగా, "ఏం చెప్పమంటారు. ఏ ఆడవాళ్ళైనా యేంకోరుకుంటారు? నేనూ అదే కోరుకున్నాను. మీరెప్పుడూ సంపూర్ణారోగ్యంతో వుండాలనీ, ఎప్పుడూ, యే జబ్బూ చెయ్యకూడదనీ, జ్వరంకూడా రాకుండా వుండాలనీ, ప్రమోషన్ రావాలనీ, ఇంకా పెద్ద ఉద్యోగం కావాలనీ, నన్నింకా ప్రేమగా చూడాలనీ.... మరీ...." అంటూ మాటలు మింగేసింది.

"మరీ?...." అన్నాడు వెంకటేశ్వర్లు ఆర్ద్రంగా.

కమల గువ్వపిట్టలా వొదిగిపోతూ "మరీ.... మంచి మంచి పాపలు, అంటే గుణవంతులైన పిల్లలు కావాలనీ!" కమల నవ్వేసింది.

ఒక్క క్షణంసేపు యెవరూ యేమీ మాటాడుకోలేదు.

తరువాత కమల కొంచెం దూరంగా కూచుని "అయితే మరి మీరు చెప్పండి ఇప్పుడు" అన్నది.

వెంకటేశ్వర్ల ముఖం కాస్తా దీనంగా మారిపోవటం కమల చూసింది. ఆమెకు మనస్సులో యెంతో భయం కలిగింది.

మూగవాడి సైగ తల్లికి తెలుస్తూందట.

ఈయన యెప్పుడూ తనకు దుఃఖమే కలిగిస్తుంటారు. అదంతా తనకు తెలియదని ఆయన అభిప్రాయం కాబోలు. ఓసారి ఇలానే, తన మనసంతా పూచిన సంపంగి పొదలా సంతోషంతో నిండినప్పుడు- "ఒకందుకు భగవంతుణ్ణి నేను తప్పుపడుతున్నాను. ఆయనకు, యేమాత్రం మతికూడా లేదెంచేతో అని. ఇదేమి లీల ఆయనకు, నా మొహం. ఇంతకంటే అన్యాయ మేముంది? ఛీఛీ, నాకు దేవుడికి నమస్కారం పెట్టేందుకు కూడా బుద్ధిపుట్టటంలేదు" అంటూ ఒక చిన్న ఉపన్యాసం ఇచ్చారు. తాను నిజంగానే భయపడుతూ దగ్గరగావెళ్ళి, "ఏమిటండీ, ఏమయిందేమిటి?" అని అడిగింది. అప్పుడాయన, "ఏం లేదు. భగవంతుడి తెలివికి జోహార్లు అర్పిస్తున్నాను" అన్నారు.

"ఏమయింది?"

"ఎదురుగా కనపడటంలేదు? నువ్వెంత దురదృష్టవంతురాలివి కమలం! అయ్యో, సాక్షాత్తూ, లక్ష్మీఅమ్మవారిలా గున్నావే. రాజ కుమార్తెలా వున్నావే. సౌందర్యం రాసిపోసినట్లున్నావే. మొగల్ చక్రవర్తుల అంతఃపుర స్త్రీలాగున్నావే! అటువంటి నిన్ను, నా పక్కన వుంచేశాడు. కలసి నడవమన్నాడు. గొంతు కలపమన్నాడు. ఇంకా, ఇంకా...."

తనముఖం అప్పుడు నల్లబడిపోయి వుంటుంది.

దగ్గరగా వెళ్ళి నిజంగానే యేడుస్తూ "ఏమండీ, ఇలాటిమాటలన్నీ చెపితే, నేను నిజంగానే సంతోషిస్తాననే కదూ మీ అభిప్రాయం? ఛీ ఛీ, అంత సాహసం నాకులేదు గాని, ఉంటే ఉరేసుకుని చచ్చిపోదామని వుంది" అన్నది కమలం. తరువాత అతగాణ్ణి రెండురోజులు తప్పుకు తప్పుకు తిరిగింది. మాట్లాడనేలేదు. అప్పటికిగాని తన అక్కసు తీరలేదు.

అదంతా ఇప్పుడు గుర్తు వచ్చింది కమలకు.

"ఏమిటో, ఏం కోరుకున్నారో చెప్పండి" అంది ప్రేమగా.

"చెప్పనులే, చెపితే నీకు కోపం వస్తుందేమో" అన్నాడు వెంకటేశ్వర్లు.

"నేను చెప్పలేదూ!" అన్నది కమల.

వెంకటేశ్వర్లు మౌనంగా వుండిపోయాడు.

దగ్గరగావచ్చి గడ్డంపట్టి ముఖమెత్తి కళ్ళలోకి సూటిగా చూస్తూ "చెప్పండి" అంది లాలనగా, కోపంగా, ప్రాధేయపూర్వకంగా.

"నువ్వు యేడుస్తావు. నేను చెప్పను" అన్నాడతడు.

"నేను చెప్పలేదా! నాకు యేడుపొచ్చేట్లు చెయ్యటమే మీకు అన్నిటికన్నా ఇష్టం."

వెంకటేశ్వర్ల కళ్ళలో బాధ కదలాడింది.

"ఏడవనులెండి, చెప్పండి" అంది కమల కుతూహలంగా.

"నేను చెప్పను."

కమల కుతూహలం మరీ యెక్కువైంది.

బతిమలాడింది.

"ఏడవకు" అన్నాడు.

ఆమె పళ్ళు బిగబట్టి కూచుంది.

వెంకటేశ్వర్లు బరువుగా నిట్టూర్చాడు. చెప్పాడు:

"ఈ జీవితంలో ఇంకా నేను కోరుకోవలసినవి యేమున్నాయి? భగవంతుడు నాకు అన్నీ యిచ్చాడు. నేను ఒక విచిత్రమైన మనిషిని. ఎప్పుడూ ఏదో భయం అంటిపెట్టుకునే వుంటుంది. ఎందుకో తెలీదు. ఆ ఆలోచనలన్నీ యెందుకు వస్తవో తెలీవు. ఈ మనుషులందరూ యెవరు? ఎందుకు పుడుతున్నారు? ఎందుకు చచ్చిపోతున్నారు?

ఈ స్నేహాలు, ఈ ప్రేమలు, ఈ అనురాగాలు - వీటన్నిటికీ అర్థమేమిటి? మనుష్యులకు యీ దుఃఖాలన్నీ యెందుకు? ఏమిటి యీ ఆర్తి, ఈ కోరికలు, ఈ పాట్లు, ఈ యీర్ష్యలు, అని ఆలోచిస్తూ వుంటాను. మనస్సులో భయంపుట్టి, అడవిలో నాలుగు దిక్కులకూ వ్యాపించే వట వృక్షంలా నిమిషంలో, ఆ భయం పెరిగిపోతుంది. ఈ అసంతృప్తికి కారణం యెంత ఆలోచించినా కనుక్కోలేను. చాలా కుంగిపోతాను. మథన పడతాను. నా కేమిటి కావాలో నాకు తెలీదు. ఒంటరిగావున్నప్పుడు నాకు నా కమలం కావాలనిపిస్తుంది. నా కమలం నా పక్కనే వున్నప్పుడు, నా కమలాన్ని నావద్దనుండి యెవరైనా తీసుక వెళ్తారేమోనని బాధ. ఈ ఆలోచనలకు అర్థం వుండదని నాకూ తెలుసు.

"అయినా యేం చేస్తాను. నా దురదృష్టం. క్యాంపుకి వెడతానా? ఒక అర్ధరాత్రి వేళ నిద్ర మెళుకువ వస్తుంది. మళ్ళీ నిద్ర పట్టదు. కిటికీలోంచి చీకటిలోకి చూస్తూ యెన్నెన్నో ఆలోచనలు చేస్తాను. అప్పుడప్పుడు పరుగెత్తి కమలం దగ్గరకు పోవాలనిపిస్తుంది. మళ్ళీ ఫైళ్లూ, పత్రికలూ, మూతతీసేసివున్న ఫ్లాస్కూ, పక్కగదిలో పడుకుని నిద్ర పోతున్న క్యాంప్ క్లర్కూ, వరండాలో నిద్రపోతున్న ఆఫీస్ ప్యూన్ అందరూ,నన్ను వెక్కిరిస్తున్నట్లుగా వుంటుంది. ఈ భయానికీ ఆందోళనకూ అర్థం లేదనుకో. అయినా నే నలాంటివాణ్ణి. నన్ను క్షమించు. ఇవాళ స్వామిని యేం కోరుకున్నానో చెప్పనా? నా స్వార్థమే ననుకో. మనిషి యెంత స్వార్థపరుడో చూడు. స్వార్థం దగ్గర తల్లి లేదు, బిడ్డ లేదు, భార్య లేదు భర్త లేదు, - ఒక్క స్వార్థం తప్ప వేరే యేదిన్నీ లేదు. ఎందుకే అలా కళ్ళు కిందికి వాల్చుకుంటావు? ఇలా చూడు. నేను స్వార్థపరుణ్ణి. ఒట్టి స్వార్థపరుణ్ణి. ఏం కోరుకున్నానో చెప్పనా! మనమంతా చచ్చిపోతాం కదే! అంటే ఈ మనుష్యులందరూ యెప్పుడో ఒకప్పుడు చచ్చిపోయేవాళ్ళే కదా! తప్పదాయె! అంచేత, నేనూ చచ్చిపోతాను. అందుకని, ఆ చచ్చిపోయేప్పుడు నీ వొళ్ళో తలపెట్టి చచ్చి

పోవాలని కోరుకున్నాను. ఎందుచేతనంటావా? నీవు లేకపోవటమనే దాన్ని నేను సహించలేను కనుక. ఆ తలపు కలలో వచ్చినా, దుఃఖంతో చచ్చిపోతాను గనుక, అందుకని అలా కోరుకున్నాను."

వెంకటేశ్వర్లు చెప్పటం పూర్తిచేశాడు.

కమలకు ఒక్కసారి కెవ్వున కేకపెట్టి క్రిందపడి విలవిలలాడా లనిపించింది. కాని నోటమాట రాలేదు. కళ్ళుమూసుకుందామనుకుంది. కళ్ళు మూతలూ పడలేదు. సముద్రం మధ్యగా చీలిపోతే యెంత క్షోభ కలుగుతుందో అంత క్షోభ కలిగింది ఆమె హృదయంలో. ఏమీ ఆలో చించలేకపోయింది. తను ఇంచుమించు మృత్యువు నోడించి అతణ్ణి లాక్కొచ్చుకుంది. ఇప్పుడు యేం జరిగింది?

కొంచెంసేపున్న తరువాత తెప్పరిల్లుకుని, "ఒక్కటడుగుతాను. లేదనరూ కదూ! తెచ్చిపెడతారు కదూ!" అంది కమల.

అతడామెను దగ్గరకు తీసుకోబోయాడు.

ఆమె అతగాణ్ణి నివారిస్తూ అతడి రెండు కాళ్లూ పట్టుకుని వాటి మీద తలపెట్టుకుని యేడ్చింది.

"ఏమిటి కావాలి నీకు?"

"కొంచెం విషం."

వెంకటేశ్వర్లు ముఖం తిరిగిపోయింది.

"పోనీ, నన్ను పిచ్చాసుపత్రిలో యెక్కడైనా చేర్చి మీరొక్కరే వెళ్ళిపోండి ఇంటికి."

"ఛీ, ఛీ, ఇదంతా ఉత్తదేనే, తమాషాకు చెప్పాను."

గదిలో తూరుపున తెల్లవారిన వెలుగు రేఖలు ఒకటి రెండు చొచ్చుకుని వచ్చాయి.

(కృష్ణాపత్రిక వజ్రోత్సవ సంచిక - 1964)